పేదల సొంతింటి కల సాకారం

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- జగనన్న ఎస్టీ కాలనీ వాసుల ఆత్మీయ సమ్మేళనానికి డాక్టర్ ఈవూరితో కలిసి హాజరు

రేపల్లెరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పేదల సొంతింటి కల సాకారమైందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని 18వ వార్డు జగనన్న కాలనీలోని ఎస్టీ కాలనీలో సోమవారం రాత్రి కాలనీ వాసులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న ప్రజలకు ఇచ్చిన మాట నిలుపుకునేందుకు మడమ తిప్పకుండా ముందుకు వెళ్లారన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే నవరత్నాలను నూరు శాతం అమలుచేసి అర్హులైన ప్రతి ఒక్కరి ముంగిటకు సంక్షేమ ఫలాలను అందించారన్నారు. కొవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ ఏ సంక్షేమ పథకాన్ని నిలిపివేసిన దాఖలాలు లేవన్నారు. బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకుని ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది ప్రజలకు నివేశన స్థలాలు మంజూరు చేసి అందించారన్నారు. రేపల్లె పట్టణంలోనే 3 వేల మందికి పైగా లబ్ధిదారులకు నివేశన స్థలాలు అందించటం జరిగిందన్నారు. 112 మంది ఎస్టీ కుటుంబాల ప్రజలకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ గృహాలను నిర్మించి అందించటం జరిగిందన్నారు. ఎస్టీ కాలనీలో ఇప్పటికే తాగునీటి సదుపాయం, విద్యుత్ సౌకర్యం కల్పించామని నూరు శాతం మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ తన తండ్రి ఆశయాలను పుణికి పుచ్చుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడుతూ ప్రజా సేవకే తన జీవితాన్ని అంకితం చేస్తున్నారన్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ బాగుండాలన్న ఉద్దేశ్యంతో ఏ రాష్ట్రం అమలు చేయని విధంగా సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. లబ్ధిదారులకు గృహాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కౌన్సిలర్ అద్దేపల్లి వెంకట స్వామి, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, కాలనీవాసులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న మోపిదేవి, డాక్టర్ ఈవూరి, దేవినేని మల్లికార్జునరావు



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి

క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



వేమూరు: హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులకు సీఎం సహాయ నిధి చెక్కును నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సోమవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేమూరు మండలం చావలి గ్రామానికి చెందిన గోపాలం శ్రీకాంత్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని గౌతమ్ న్యూరో కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. కుటుంబ సభ్యులు సీఎం సహాయ నిధికి అర్జీ పెట్టుకోగా ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2.20 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. చెక్కును కూచిపూడి గ్రామంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అందజేశారు.

కోదండ రామాలయంలో కొనసాగుతున్న పూజలు

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో శ్రీ కోదండరామస్వామి వారి దేవాలయ పునః ప్రారంభోత్సవం, నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు క్రోవి ప్రభాకరమూర్తి నిర్వహించగా ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాలను ధూళిపూడికి చెందిన జానపాటి లీలా వేణుగోపాల శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు నిర్వహిస్తున్నారు.

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

పెదపూడి(వేమూరు): పదో తరగతి చదవుతున్న విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని రెవరెండ్ అత్యాల పాల్ రంజన్ అన్నారు. పెదపూడి గ్రామానికి చెందిన అత్యాల సమంత్‌పాల్ జ్ఞాపకార్థం సోమవారం పెదపూడి జిల్లా ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు పరీక్షల సామాగ్రి వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అత్యాల పాల్ రంజన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో 2024–2025 విద్యా సంవత్సరంలో ఉచిత విద్యను అభ్యసించడానికి ఒకటవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు మండల విద్యాశాఖాధికారులు పి.లాజర్, ఎస్ దేవరాజులు సోమవారం తెలిపారు. ఏపీ విద్యా హక్కు చట్టం ప్రకారం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పిల్లలను పాఠశాలలు ఉచితంగా చేర్చుకోవాల్సి ఉందన్నారు. సంబంధిత ధృవ పత్రాలతో మార్చి 14 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు మండల విద్యా వనరుల కేంద్రం టోల్‌ఫ్రీ నెంబర్ 14417లో సంప్రదించాలని కోరారు.


కర్లపాలెంలో పేదలకు అన్నదానం

కర్లపాలెం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమాని కర్లపాలెం వైఎస్సార్ కూరగాయల మార్కెట్ వద్ద రాజన్న ప్రసాదం పేరిట పేదలకు అన్నదానం నిర్వహించటం అభినందనీయమని వైఎస్సార్ సీపీ నాయకులు తాతపూడి మనోహర్ అన్నారు. వైఎస్సార్ అభిమాని కొక్కిగడ్డ రామరాజు ఆహార్ ధాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం కర్లపాలెం కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన అన్నదానాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు తాతపూడి మనోహర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

కొల్లూరు : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం మండలంలోని ఈపూరులంకలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీ కుమారి సోమవారం తెలిపారు. స్థానిక పాఠశాల ప్రాంగణంలో నిర్వహించనున్న శిబిరంలో పలు రకాల అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేస్తారన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



భట్టిప్రోలు: భట్టిప్రోలు రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. రైల్వే జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం సోమవారం భట్టిప్రోలు రైల్వే స్టేషన్ ట్రాక్‌పై రేపల్లె నుంచి సికింద్రాబాద్ వెళుతున్న రైలు కింద పడి వ్యక్తి మృతి చెందాడు. సమాచారం మేరకు రైల్వే జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రవి కిరణ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెనాలి జీఆర్పీ ఎస్‌ఐ ఎల్. సరస్వతి తెలిపారు.

సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

భట్టిప్రోలు: చేనేత సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయక కార్యదర్శి జి బాలాజీ సోమవారం భట్టిప్రోలు తహసీల్దార్ సీహెచ్ పద్మావతికి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ చేనేత కార్మికుల పింఛన్ల మంజూరులో తీసుకువచ్చిన నూతన నిబంధనలను రద్దు చేయాలని కోరారు. 50 ఏళ్లు నిండి చేనేత గుర్తింపు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాల పాలకవర్గ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు కె. రామకోటేశ్వరరావు, కె. మోహన్‌రావు, బీవీ సుబ్బారావు, ఎస్. జగన్‌మోహన్‌రావు, కె. కోటేశ్వరరావు, కె. పార్థసారథి, సీపీఐ నాయకుడు బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

కోల్డ్‌స్టోరేజి బాధిత రైతులకు న్యాయం చేయాలి

పసుపు రైతుల ధర్నాలో రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు

తెనాలి: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజిలో అగ్నిప్రమాదం సంభవించి నెలరోజులు దాటినా ప్రభుత్వం, యాజమాన్యం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవటం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో సోమవారం జరిగిన పసుపు రైతుల ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడారు. కోల్డ్ స్టోరేజి అగ్ని ప్రమాద ఘటనలో రైతులకు నష్టపరిహారం చెల్లించటంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ మార్చి ఒకటో తేదీ నుంచి జరగనున్న రిలే దీక్షల్లో రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య మాట్లాడుతూ రైతులకు రూ.100 కోట్లు నష్టం వాటిల్లినా కమిటీ నివేదిక పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయటం శోచనీయమన్నారు. ఉద్యమాలతోనే రైతు సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం స్పందన సమావేశంలో సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను కలిసి పసుపు రైతుల కష్టాలను వినిపించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు త్వరితగతిన న్యాయం చేయాలని కోరారు. రేపల్లె మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, బాపట్ల జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వేములపల్లి వెంకటరామయ్య, వివిధ సంఘాల నాయకులు ములకా శివసాంబిరెడ్డి, కళ్లం రాజశేఖరరెడ్డి, ఈదర పూర్ణచంద్, ముద్దన సాంబశివరావు, సీఐటీయూ నాయకులు కేబీ ప్రసాద్, షేక్ హుస్సేన్‌వలి, వై.బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌తో రైతు సంఘ నేతలు

సబ్ కలెక్టర్‌కు వినతి..

స్పందనకు 5 అర్జీలు

రేపల్లెరూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికై నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి ఐదు అర్జీలు అందినట్లు రెవిన్యూ డివిజనల్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేక శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. భూసర్వే సర్టిఫికెట్ ఇప్పించాలని కోరుతూ నగరం మండలం నుంచి అర్జీ అందగా మాండూస్ తుఫానుతో కలిగిన పంట నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ బేతపూడి గ్రామంలో రెండు అర్జీలు అందాయన్నారు. నివేసన స్థలం సర్వే సర్టిఫికేట్‌కు రేపల్లె మున్సిపాలిటీ నుంచి ఒక అర్జీ అందగా, తమ భూమి సమస్యలను రెవిన్యూ కోర్టు ద్వారా పరిష్కరించాలని కోరుతూ ఉప్పూడి గ్రామం నుంచి అర్జీ అందిందన్నారు. రేపల్లె పట్టణంలో సర్ ఆర్థర్ కాటన్ దొర విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పట్టణ ఆదర్శ వేదిక సభ్యులు అర్జీ అందించారన్నారు.

ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం



చెరుకుపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో విద్యావ్యాప్తికి కృషి చేసిన ఉపాధ్యాయుడు పరదాప కోటేశ్వరరావుకు అరుదైన గౌరవం దక్కింది. విద్యాపరంగా ఆయన చేసిన కృషిని గుర్తించి హైదరాబాద్‌కు చెందిన ఆల్‌దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు స్థానిక దేవులపల్లి రామానుజ కళా కేంద్రంలో ఆదివారం ఉపాధ్యాయ రత్న అవార్డుతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి సి చంద్రయ్య, అకాడమీ ప్రముఖులు మందాడి కృష్ణారెడ్డి తదితరులు కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. మండలంలోని ఆరేపల్లి ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న కోటేశ్వరరావుకు అవార్డు రావటం పట్ల ఎంఈవోలు పి లాజర్, టి నవీన్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం కాటూరు నాగేశ్వరరావు, తదితరులు అభినందించారు.

గ్రామాల్లో బీజేపీ ప్రజాపోరు యాత్ర

వేమూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజా పోరు కార్యక్రమం చేపట్టడం జరిగిందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గల్లా వెంకట్ కోటేశ్వరరావు తెలిపారు. వేమూరు మండలంలోని చదలవాడ, కాకర్లమూడి, వెల్లబాడు, వరహాపురం, చంపాడు, జంపని గ్రామాల్లో ప్రజాపోరు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ పిలుపు మేరకు ప్రజా పోరు–2 యాత్ర నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వెలువల సాంబశివరావు, బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు మందా జనార్ధన్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు అద్దేపల్లి రాఘవులు, జిల్లా ఎస్సీ సెల్ మోర్చా అధ్యక్షులు బేతపూడి వెంకటేశ్వరరావు, ఎస్సీ మోర్చా జనరల్ సెక్రటరీ యాల్లమాటి దాసు, ప్రజా పోరు అసెంబ్లీ కన్వీనర్ అత్మకూరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లోని సువర్చల సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం పుష్పోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమ పండితులు ఎంజీఎల్ రఘురామ్, వేదాంతం నాగమారుతీ, ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైదిక క్రతువు నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీలక్ష్మి కూచిపూడి నృత్య కళా ఖండం ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి శిష్య బృందం చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ దంపతులు, నిఖిల్ శాండిల్యా దంపతులు, కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి దంపతులు, దాతలు గుడివాడ బాలకృష్ణ దంపతులు, గుంటి వెంకట్ దంపతులు, మూర్తి వెంకటేశ్వరరావు దంపతులు, జంధ్య రామారావు దంపతులు, సంకీర్తన బృందం అధ్యక్షురాలు అనురాధ, సంకీర్తన సేవా సమితి అధ్యక్షులు కిరణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.



ఆటో ఢీకొని మహిళకు గాయాలు

పట్నంబజారు: ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి ఆటో బోల్తాపడిన సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్కెట్ నుంచి గుజ్జనగుండ్ల వెళుతున్న ఆటో ఎస్పీ కార్యాలయం దాటి కొంత దూరం వెళ్లిన తరువాత కంకరగుంట ఫ్లెఓవర్ దిగి పోస్టాఫీసు వద్ద యు టర్న్ తీసుకుంటున్న ఝాన్సీ అనే మహిళను ఢీకొంది. ఈ క్రమంలో ఆటో బోల్తా పడింది. ఆటోడ్రైవర్ కోటేశ్వరరావు అతివేగంగా వెళుతూ ప్రమాదానికి కారణమయ్యాడని పోలీసులు తెలిపారు. గాయాలపాలైన మహిళ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మానవాళి రక్షణకు చెట్ల పెంపకం అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: భూమిపై మనుషులతో పాటు సకల జీవజాతులు మనుగడ సాగించేందుకు పచ్చని వృక్షాలు ఎంతో కీలకమని గుంటూరు జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ నిర్వహణ అధికారి జె.వి. సుధీర్‌కుమార్ తెలిపారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం–2 ఆధ్వర్యంలో జోసఫ్‌నగర్‌లో చేపట్టిన ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా సోమవారం మండల పరిషత్ పాఠశాలతో పాటు పట్టణ ఆరోగ్య కేంద్ర ప్రాంగణంలో మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధీర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థినులు నాటిన మొక్కలు రాబోయే రోజుల్లో వృక్షాలుగా ఎదిగి, సమస్త జీవకోటికి ప్రాణవాయువును ప్రసాదిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగ అధికారిణి డి.ధాత్రికుమారి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



పాఠశాల వద్ద విద్యార్థినులతో సుధీర్‌కుమార్, ధాత్రికుమారి

కన్నెగంటి హనుమంతుకు ఘన నివాళి

గుంటూరు మెడికల్: స్వాతంత్ర్య సమర యోధుడు కన్నెగంటి హనుమంతు సేవలు ఎంతో విలువైనవని అహల్య ట్రస్టు నిర్వాహకులు, ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణురాలు డాక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. కన్నెగంటి హనుమంతు వర్ధంతి సందర్భంగా సోమవారం చుట్టుగుంట సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తెనాలిరూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భట్టిప్రోలు స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి భట్టిప్రోలు స్టేషనులో రైలు కింద పడి ఆదివారం అర్ధరాత్రి దాటాక మృతి చెందాడు. సోమవారం సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోందని పోలీసులు తెలిపారు.

రాజకీయ దొంగల ముఠాకు బుద్ధి చెప్పాలి

ఎంపీ నందిగం సురేష్

బాపట్ల: రాజకీయ నిలకడలేని వ్యక్తులు రాష్ట్ర భవిష్యత్‌ను అడ్డుకోవాలని చూస్తున్నారని ఎంపీ నందిగం సురేష్ పేర్కొన్నారు. బాపట్లలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు రాజకీయ నైతిక విలువలు లేని వ్యక్తిగా ప్రజలు భావిస్తున్నారన్నారు. పవన్‌కల్యాణ్‌కు రాజకీయంపై పెద్దగా అవగాహన లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, ప్రజల సంతోషాన్ని హరించివేసేందుకు దొంగల ముఠా ప్రజల వద్దకు వస్తోందన్నారు. ప్రజలే వీరికి తగిన గుణపాఠం చెప్పాలని నందిగం కోరారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన 24సీట్లు ముష్టి తీసుకున్న పవన్‌కళ్యాణ్‌కు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురించి మాట్లాడే హక్కులేదన్నారు. వైనాట్ 175 సీట్లు తప్పని సరిగా సాధిస్తామని నందిగం సురేష్ ధీమా వ్యక్తం చేశారు.



ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

బోడపాడు(వేమూరు): ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో పర్యటన చేయడం జరుగుతుందని నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు తెలిపారు. వేమూరు నియోజకవర్గంలోని అమర్తలూరు మండలంలోని బోడపాడు గ్రామంలో పర్యటించిన ఆయన ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలకు ఆకర్షితులైన బోడపాడు గ్రామంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన 30 కుటుంబాలు సోమవారం నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. తెలుగు దేశం పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వ్యక్తులకు సముచిత స్థానం కల్పిస్తామని వారికి ఆయన హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కారం చేశారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేమ చంద్ర శ్రీనివాస్, ఎంపీపీ రాపర్ల నరేంద్ర, వైస్ ఎంపీపీ కె శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ గేరా ప్రతాప్, బోట్టు మోషే, గుమ్మడి రవి రాజా, బీసీ సెల్ అధ్యక్షుడు మోదుకూరు హరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు యలవర్తి సురేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీ కార్యకర్తలకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న అశోక్‌బాబు

ఎరువుల విక్రయాలలో నాణ్యత పాటించాలి

- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రమణకుమార్
- పరిశావారిపాలెంలో ఎరువుల దుకాణంపై కేసు నమోదు

నగరం: రైతులకు నాణ్యతా విలువలతో కూడిన విత్తనాలు, పురుగు మందులు మాత్రమే విక్రయించాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అగ్రికల్చరల్ ఆఫీసర్ కే.రమణకుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు మండలంలోని పరిశావారిపాలెం గ్రామంలోని ఎరువుల దుకాణాలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించి మాట్లాడారు. ఎరువుల దుకాణాలను నిర్వహించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. దుకాణంలో విక్రయించిన విత్తనాలు, పురుగు మందులకు వినియోగదారునికి రశీదును అందించాలన్నారు. స్టాక్ వివరాలను రికార్డులలో పొందుపరచాలన్నారు. గ్రామంలోని అన్నపూర్ణ ఎంటర్ ప్రైజస్ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన పురుగు మందులను గుర్తించటం జరిగిందన్నారు. రూ.99,500 విలువ చేసే పురుగు మందులను సీజ్ చేసి నిర్వాహకుడిపై కేసు నమోదు చేశామన్నారు. దాడులలో సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య, స్థానిక వ్యవసాయ, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

అసత్య ప్రచారాలు నమ్మవద్దు

తెనాలిఅర్బన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పురపాలక సంఘం సరఫరా చేసే రక్షిత మంచినీరు కలుషితమైందని పలువురు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని చెంచుపేట, అమరావతి ప్లాట్స్ ఏరియాలో సోమవారం ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో చెత్త సేకరణ పనులు పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని డీ అండ్ వో ట్రేడ్ లైసెన్స్‌లు వ్యాపారులు వెంటనే రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. అలా చేయించుకోని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లో నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం

పొన్నూరు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో అసోసియేషన్ ఫర్ వెల్ఫేర్ యాక్టివ్ రూరల్ డెవలప్‌మెంటు ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్‌పీపీ రోడ్డులో ఏర్పాటైన ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని సోమవారం యూనియన్ బ్యాంక్ మేనేజర్ జి. సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పరిధిలో పొన్నూరు, కాకుమాను, చేబ్రోలు మండలాల ప్రజలకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కేంద్ర నిర్వాహకులు వై. రమేష్, పి .రత్నకుమారి మాట్లాడుతూ బ్యాంకింగ్ లావాదేవీలు, డిజిటల్ బ్యాంకింగ్, సైబర్ నేరాలు, ఇన్సూరెన్స్, పెన్షన్ స్కీములు, యూనియన్ బ్యాంక్ సేవల్ని గ్రామ స్థాయిలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



బాపట్ల యువకుడిపై నాన్‌బెయిలబుల్ వారెంట్

తెనాలిరూరల్: బాపట్లకు చెందిన యువకుడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. తెనాలి జీఆర్పీ స్టేషన్‌కు సంబంధించిన కేసు 111/15లో బాపట్ల రాజీవ్ నగర్‌కాలనీకి చెందిన దండముడి ఏసోబు అలియాస్ కుమ్మరిగుంట ఏసోబు ముద్దాయిగా ఉన్నాడు. ఇతను ఆచూకీ లేకుండా పోవడం, కోర్టు వాయిదాలకు హాజరుకాకపోతుండడంతో న్యాయస్థానం నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసిందని జీఆర్పీ ఎస్‌ఐ ఎల్.సరస్వతి సోమవారం తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలన్నారు.

మహిళపై దాడి

తెనాలిరూరల్: అక్రమంగా ఇంట్లోకి చొరబడడమే కాకుండా మహిళపై దాడి చేసిన వ్యక్తి మీద కేసు నమోదైంది. రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నందివెలుగుకు చెందిన కోలాటి మల్లేశ్వరి ఇంట్లోకి అదే గ్రామానికి చెందిన బదిరి జయశేఖర్ ఆదివారం రాత్రి అక్రమంగా చొరబడ్డాడు. ఇంట్లోని సామాను ధ్వంసం చేయడమే కాకుండా వివాహితతో ఘర్షణ పడి ఆమెపై దాడి చేసి గాయపర్చాడు. బాధితురాలు సోమవారం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.